అంబేడ్కర్‌కు నాయకుల నివాళి


గంగాధర: నివాళి అర్పిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నాయకులు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలు కొనియాడారు. అంబేడ్కర్ చూపిన స్ఫూర్తితో నేటి యువతరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని పలువురు పేర్కొన్నారు. అక్కడక్కడ రాజ్యాంగ పుస్తకాలను పంపిణీ చేశారు. అంబేడ్కర్ జయంతిని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ, పలు మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించకపోవడంతో అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి ఆయా అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తుందని అధికార పార్టీ నాయకులు పేర్కొన్నారు. వేడుకల్లో అధికారులు, ఆయా రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాపూర్: అల్గునూర్ చౌరస్తాలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


హుజూరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి


జమ్మికుంట: నివాళి అర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది


హుజూరాబాద్‌రూరల్: ఇప్పలనర్సింగాపూర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు


సైదాపూర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు


గన్నేరువరంలో ..


శంకరపట్నం: రాజ్యాంగ పుస్తకంతో మైనార్టీ నాయకులు


మానకొండూర్‌లో...


శంకరపట్నం: నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ అనుపమ


రామడుగు: నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ భాస్కర్


హుజూరాబాద్: నివాళి అర్పిస్తున్న వొడితెల ప్రణవ్, నాయకులు

అ'పూర్వ' సమ్మేళనం





సైదాపూర్: మండలంలోని వెన్నెంపల్లి ఉన్నత పాఠశాల 1981–82 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 42 ఏళ్ల తర్వాత పాఠశాల ఆవరణలో కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండడం ఆనందంగా ఉందని గురువులు మల్లారెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాసు పేర్కొన్నారు.

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామం ప్రభుత్వ పాఠశాల 1997–98 పదో తరగతి విద్యార్థులు ఆదివారం మానకొండూర్ మండలం ఖాదరగూడెంలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. సుదీర్ఘకాలం తర్వాత ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

గన్నేరువరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998–99 పదో తరగతి విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గన్నేరువరం కళ్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహించి చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. సాయంత్రం వరకు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. గురువులను సత్కరించారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం


రామడుగు: కల్యాణోత్సవంలో భక్తులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆదివారం వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ కర్ర సత్యప్రసన్నవెంకట్రామిరెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేశారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

మండలంలోని వెదిర గ్రామ పరిధి వెంకటగిరికాలనీలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. నూతనదేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించిన అనంతరం గ్రామస్తులు పోచమ్మ బోనాలు తీశారు. దేవతామూర్తులకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా విషు పూజలు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో కేరళ ఉగాది(విషు) పురస్కరించుకొని అయ్యప్పస్వామికి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జయేందర్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, కోశాధికారి జగదీశ్వర్, గురుస్వాములు మనోహర్, వీరరాజు, ప్రభాకర్ రావు, ఒగ్గు రమేశ్, భక్తులు పాల్గొన్నారు.

బోనమెత్తిన తిమ్మాపూర్

తిమ్మాపూర్: గ్రామంలోని గౌడ, అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనంతో డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా ఎల్లమ్మ ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులందరినీ చల్లగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కంకణాల రమేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనుకులగిద్ద గ్రామంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి చంద్రయ్య, ధర్మప్రసాద్ మండల ప్రముఖ్ ప్రభాకర్, గ్రామశాఖ అధ్యక్షుడు రాజు, కార్యకర్తలు, ఆయా గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

దాతల సాయంతో ఆలయ అభివృద్ధి

చొప్పదండి: దాతల సాయంతో సాయిబాబా ఆలయాన్ని అభివృద్ధి చేసినట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం ఆలయం మొదటి వార్షిక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డోలి రాజయ్య, కోశాధికారి దండె లింగన్న, కటుకం మహేశ్, కొల్లూరి ఆనందం, తాటిపెల్లి అంజయ్య, గుర్రం చంద్రారెడ్డి, దూస లక్ష్మీనర్సయ్య, మామిడాల వెంకటాద్రి పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్ మాదాపూర్ గ్రామ కమిటీ



గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామం బీఆర్ అంబేడ్కర్ శాశ్వత కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాల్, ఉపాధ్యక్షులుగా మహేందర్, రమేష్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా అశోక్, ప్రచార కార్యదర్శులుగా భూపెల్లి రమేశ్, స్వామి, సంయుక్త కార్యదర్శులుగా జోషి,అనిల్, సహాయ కార్యదర్శులుగా శేఖర్, శంకర్, గౌరవ సలహాదారులుగా రవీందర్‌రెడ్డి, కొమ్మెర రవీందర్‌రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, సంపత్, బాలయ్య,సత్తయ్య,తిరుపతిరెడ్డి, ఆంజనేయులు, కత్తి శ్రీనివాస్, అసరి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా చంద్రయ్య, ప్రసాద్, పోచమల్లు, రాజు, సంపతి శ్రీనివాస్, సంపత్, రాములు, అరవింద్, శివ, కరుణాకర్ నియామకమయ్యారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇన్‌చార్జి ఎంపీపీ



రామడుగు: రామడుగు ఇన్‌చార్జి ఎంపీపీ పూరెల్ల రాజగోపాల్‌గౌడ్ ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌గౌడ్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు అమిరిశెట్టి సుధాకర్, అనుపురం వెంకటేశ్‌గౌడ్, మిరియాల సంపత్‌రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్, పలువురు పాల్గొన్నారు.

'కాంప్లెక్స్ జీతాల అవకతవకల్లో ప్రమేయం లేదు'

కరీంనగర్‌కల్చరల్: ఎల్ఎండీ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయుల సెలవు జీతాల విషయంలో జరిగిన రూ.పది లక్షల అక్రమాల్లో తనకు ఎలాంటి ప్రమేయం లేదని జెడ్పీహెచ్ఎస్ ఎల్ఎండీ కాలనీ జూనియర్ అసిస్టెంట్ తిరుమల ప్రకటనలో తెలిపారు. తాను 75 శాతం అంధురాలైనందున ఎలాంటి రికార్డు వర్క్, ఆన్‌లైన్ వర్క్ రాదని, తన భర్తను సహాయకుడిగా నియమించుకొని ఆఫీస్ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన భర్త ఎక్కడైనా ఫోర్జరీ సంతకం చేస్తే అధికారులు తీసుకునే ఎలాంటి చర్యలకైనా సిద్ధమని, ఈ విషయంలో ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్, సీపీని కోరారు.

ఆర్యవైశ్య మహాసభ పటిష్టతకు కృషి చేయాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న పట్టణ, మండల అధ్యక్షులు

జమ్మికుంట: ఆర్యవైశ్య మహాసభ సంఘం పటిష్టతకు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ,కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చందారాజులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మహాసభ పట్టణ అధ్యక్షుడిగా కేఆర్‌వీ నర్సయ్య, మండల అధ్యక్షుడిగా గుండా తిరుపతయ్య, మహిళ అధ్యక్షురాలిగా ముక్క మాధవి, యువజన విభాగం అధ్యక్షుడిగా శ్యామ్‌కిషోర్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు, భవనం, సంగం సభ్యత్వాలు పెంపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొండ్లె మల్లికార్జున్, ఆగిరి వెంకటేశ్, ఉప్పల శారద, కాచం సుష్మ, సామ్రాజ్యలక్ష్మి, కన్న కృష్ణ, శివానాథుని శ్రీనివాస్, ఎలిమిల్ల రాజేంద్రప్రసాద్, యాద సతీష్, బచ్చు భాస్కర్, రాష్ట్ర, జిల్లా, పట్టణ, మండల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బొల్లి శ్రీనివాస్ (56) ఆదివారం రాత్రి ట్రాక్టర్ పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. శ్రీనివాస్ జీపీకి సంబంధించిన ట్రాక్టర్‌తో చెట్లకు నీరుపోస్తుంటాడు. ఆదివారం రాత్రి నీటిని నింపుకొని వచ్చే క్రమంలో అదుపు తప్పి ట్రాక్టర్ కింద పడ్డాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. భార్య గతంలోనే చనిపోయింది.

బావిలో పడి వృద్ధుడి మృతి

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రామగిరి లింగయ్య (85) బావిలో పడి మృతి చెందాడు. సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు. లింగయ్యకు కొన్నేళ్లుగా కళ్లు కనిపించకపోవడంతోపాటు ఆరోగ్యం సహకరించడం లేదు. ఆదివారం కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు ఆచూకీ ఆరా తీయగా గ్రామ సమీపంలోని పాతబావిలో పడి చనిపోయాడని కోడలు పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అదృశ్యం కేసు నమోదు

జమ్మికుంట: ఓ వృద్ధుడి అదృశ్యం కేసు ఆదివారం నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటకు చెందిన గాజుల పర్శరాములు(70) ఇంట్లో గొడవ పడి ఈ నెల 28వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో పెద్ద కుమారుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధి దమ్మక్కపేట చెరువుకుంట శివారులో పేకాటస్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆరుగురిని అరెస్టు చేసి రూ.4,500 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని పట్టణ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు.

వాహనాల తనిఖీ

జమ్మికుంట: ఎంపీఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని గణేశ్‌నగర్, మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో టౌన్ సీఐ వరగంటి రవి కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమతి పత్రాలు, డ్రంకెన్‌డ్రైవ్, ట్రిబుల్ రైడింగ్ తదితర కేసు నమోదు చేశారు.